క్లుప్తంగా

మల్యాలలో పొలంబడి కార్యక్రమం



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ విజయశేఖర్

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డివిజన్ వ్యవసాయ అధికారి విజయశేఖర్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలంబడి వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పొలంబడి ద్వారా ఏయే పంటలు, ఏ భూములకు సరిపోతాయి, ఆ పంటలకు తెగుళ్ల సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రతి రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను ఆర్జించవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ఏఓ షెహ్నావలి, ఆర్బీకేలు, రైతులు, పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



నీట మునిగిన పంటలను చూపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి కోరారు. వారు గురువారం మాట్లాడుతూ.. పట్టణంలోని నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం వల్ల డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో నీరు చేలల్లోకి చేరి పంటలు నీట మునిగాయని వాపోయారు. ఎకరాకు రూ. 50 వేల వరకు నష్టం జరిగిందని చెప్పారు. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, బాబు, మాబాషా, వేణు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు



పైపులైన్ మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

పాములపాడు: మండల కేంద్రంలోని నాభిశిల వద్ద, మంచి నీళ్ల బోరింగ్ ఏరియాలో వీధి కుళాయి పైప్‌లైన్ల మరమ్మతు పనులను సర్పంచ్ మేకల భాగ్యమ్మ గురువారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైప్ లైన్లు లీకవ్వడంతో గ్రామంలో 3 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో లీకైన ప్రాంతాలను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామంలో నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతోందని, ప్రజలకు నీటి సమస్య పరిష్కారమైందని వివరించారు.


ఉప్పొంగిన భవనాశి



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి వాగు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాశి వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో గురువారం కేవలం 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. అయితే నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షం వల్ల ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో వాగు ఉధృతంగా ప్రవహించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రానికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. వర్షం కురిసిన ప్రతిసారి ఇస్కాల గ్రామస్తులకు కష్టాలు తప్పడం లేదు. ఇంకెన్నాళ్లు ఈ ఇబ్బందులు పడాలోనని ప్రజలు వాపోతున్నారు. వంతెన నిర్మాణం చేపడితేనే తమకు కష్టాలు తప్పుతాయని పేర్కొంటున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళాలు



దాత పి.శేషగిరిరావును సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన పి.శేషగిరిరావు రూ.1,01,116, అలాగే గుంతకల్‌కు చెందిన బి.పునీత్‌కుమార్ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు వేర్వేరు సమయాల్లో అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

వ్యవసాయ విద్యుత్‌కు ‘చంద్ర’ గ్రహణం

- గ్రూప్–ఏ, గ్రూప్–బీలు విభజించి విడతల వారీగా విద్యుత్ సరఫరా
- రాత్రి వేళల్లో నీటి తడులు కట్టుకోలేక రైతుల అవస్థలు
- పగటిపూట నిరంతర విద్యుత్ ఇస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు హామీ
- జగనన్న పాలనలో పగటి పూటనే నిరంతర విద్యుత్



పగిడ్యాల 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

పగిడ్యాల: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు కొర్రీలు పెడుతోంది. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఇంకా మెరుగైన సంక్షేమాన్ని అందిస్తామని కూటమి నేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, దగ్గుబాటి పురందేశ్వరి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం శోచనీయం. ఇదిలా ఉండగా దేశానికి వెన్నెముక అయిన అన్నదాతకు ఖరీఫ్ సీజన్ పెట్టుబడి సాయాన్ని అందించకుండా మోసం చేసిన బాబూ.. మాయలోడు అంటూ సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ చూస్తే భయమేస్తోందని, అలాగే కూటమి మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాది రూట్‌మ్యాప్ వేస్తామని, మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లను ఈ ఏడాది ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి వారి నైజం మోసమని చెప్పకనే రుజువు పర్చుకున్నారని నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఇదిలా గుండగా గత వారం రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలను మార్పులు చేయడం వల్ల రైతాంగం రాత్రుల్లో ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణాతీతంగా మారాయి. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 9 గంటలు పగటిపూట విద్యుత్ అందిస్తామని చెప్పి ఇప్పుడు విడతల వారీగా ఇవ్వడం శోచనీయమని రైతులు విమర్శిస్తున్నారు. 2004 కంటే ముందు రైతులు ఎదుర్కొన్న చీకటి రోజులు మళ్లీ గుర్తుకు వచ్చాయని ఆయా గ్రామాల రైతులు ధ్వజమెత్తుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లని చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేసిన నయవంచకుడు చంద్రబాబు అని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల మండలాల్లో సుమారు పది వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత జగనన్న ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పగటి పూటనే వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేశారని, కూటమీ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే కోతలు మొదలయ్యాయని ఆవేదన చెందుతున్నారు. గ్రూప్ ‘ఏ’ కింద ఉండే వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు పగటి పూట 6 గంటలు, రాత్రి పూట 3 గంటల ప్రకారం, గ్రూప్‘బి’ కింద ఉండే వ్యవసాయ విద్యుత్ వినియోదారులకు పగటి పూట 8 గంటలు, రాత్రిపూట 1 గంట ప్రకారం సరఫరా వేళల్లో మార్పులు చేసి ఇవ్వడం వల్ల రైతాంగం ఎదుర్కొన్న కష్టాలు వర్ణణాతీతం. ఏదిఏమైనా మాట తప్పని మడమ తిప్పని జగనన్న పాలనలోనే రైతాంగానికి మేలు జరిగిందని చర్చించుకోవడం విశేషం.

అప్రకటిత విద్యుత్ కోతలతో అల్లాడుతున్నాం



వ్యవసాయానికే కాదు గృహ విద్యుత్ సరఫరాలో కూడా అప్రకటిత కోతలు విధిస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతాదో చెప్పలేని పరిస్థితి ఉంది. రాత్రి వేళల్లో సరఫరా నిలిపివేయడం వల్ల దోమల బెడదతో అల్లాడిపోతున్నాం. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు పత్రికల్లో చూస్తున్నాం. అయినా కోతలు ఎందుకు విధిస్తున్నారో తెలియడం లేదు.

– రామకృష్ణ, పాత ముచ్చుమర్రి

వర్షభావంతో లోడ్ పడుతోంది

వర్షభావంతో లోడ్ పడడం వలన ఈనెల 17వ తేదీ నుంచి విడతల వారీగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం వర్షం కురిసినందున పగటి పూటనే కరెంట్ అందించేందుకు కృషి చేస్తున్నాం. పరిస్థితులను బట్టి విద్యుత్ సరఫరా కొనసాగింపు ఉంటుంది.

– శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏడీ, నందికొట్కూరు

పగటి పూటనే 9 గంటల విద్యుత్ ఇవ్వాలి



గత జగనన్న పాలనలో వ్యవసాయానికి పగటి పూట నిరంతర విద్యుత్ సరఫరా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వారం రోజులుగా విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసి పగలు, రాత్రి పూట సరఫరా చేస్తున్నారు. మొక్కజొన్న పొలాల్లో రాత్రి వేళ నీటి తడులు కట్టుకోవాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొలాల వద్దకు వెళ్తున్నాం. కరిచే పాము, పురుగు, అడవి జంతువుల భయంతో రాత్రి వేళల్లో చాలా అవస్థలు పడుతున్నాం. – ప్రభాకర్, పగిడ్యాల

పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి



ఖరీఫ్ సీజన్‌లో బావి, బోర్ల వద్ద 15 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ప్రస్తుతం పైరు కంకిపట్టి పాలుపోస్తుంది. 20 రోజులకు పైగా వర్షభావం నెలకొని పైర్లు వాడుబారాయి. ఈ సమయంలోనే విద్యుత్ అధికారులు వ్యవసాయ కరెంట్ సరఫరాలో మార్పులు చేశారు. పగలు, రాత్రి పూట సరఫరా ఇవ్వడం వల్ల నీటి తడులు కట్టుకోవడానికి పడుతున్న అవస్థలు వర్ణాణతీతం. పైర్లు ఎండిపోవడం చూసి 2004 కంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు పాలనలో ఎదుర్కొన్న కష్టాలు గుర్తుకు వచ్చాయి. ఆ చీకటి రోజులను తలుచుకుంటేనే గుండె ఆగిపోతాది.

– అంబయ్య, లింగాపురం

నేడు గ్రామ సభలు

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్‌పై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఏపీఓ విమలమ్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల వారీగా నోడల్ ఆఫీసర్లను నియయించినట్లు చెప్పారు. భానుముక్కలకు ఎంపీడీఓ గోపీక్రిష్ణ, బానకచెర్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి, రుద్రవరం ఈఓపీఆర్డీ గంగాధర్, చెలిమిల్ల ఏఈ హౌసింగ్ శ్రీనివాసులు, ఇస్కాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలీదేవి, మద్దూరు ఏపీఎం వెలుగు అనురాధ, పాములపాడు డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, వేంపెంట ఎంసీఓ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెంచయ్య, యర్రగూడూరు ఏఈ పీఆర్ రాఘవేంద్రప్రసాద్ బాబు, జూటూరు మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, తుమ్మలూరు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ అనిల్‌కుమార్, వానాల ఎంఈఓ బాలాజీనాయక్, లింగాల ఈసీ ఎన్ఆర్ఈజీఎస్ రమేష్‌నాయుడు, మిట్టకందాల ఏపీఓ విమలమ్మను కేటాయించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గ్రామ సభలకు హాజరుకానున్నట్లు వివరించారు.

పక్కాగా నిర్వహించాలి

మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి ప్రతి గ్రామ పంచాయతీలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకొనేందుకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ సభలలో యువత, ప్రజాప్రతినిధులను బాగస్వాములను చేయాలని సూచించారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి



కస్తూర్బా బాలికల విద్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి

మిడుతూరు: ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని త్రీమెన్ కమిటీ సభ్యులు (ఎంపీడీఓ, ఎంఈఓ, డిప్యూటీ తహసీల్దార్) తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించడంతో పాటు చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, సమయపాలన పాటించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. ఎంఈఓ శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ షనావాజ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాష, ఇన్‌చార్జ్ ఎస్ఓ ఉమాగైర్వాణి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ సి.శరత్‌కుమార్ రెడ్డి

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సి.శరత్‌కుమార్ రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన బండిఆత్మకూరు, చాగలమర్రి, శిరివెళ్ల, రుద్రవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూర్ రూరల్, కర్నూలు త్రీ టౌన్, ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లలో పనిచేసినట్లు ఆయన వెల్లడించారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న తనకు ముచ్చుమర్రికి పోస్టింగ్ ఇవ్వడంతో సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో చార్జ్ తీసుకున్నట్లు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ప్రజలు తమ ఫిర్యాదులను స్వయంగా స్టేషన్‌కు వచ్చి ఇవ్వవచ్చని సూచించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్ఐగా పనిచేసిన గంగయ్య యాదవ్ నంద్యాల టూటౌన్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి

ఆత్మకూరు: చట్టాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి, ఆర్డీఓ ఏఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.మోహన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరు మండలంలోని నాగలూటి గూండెం, ఇందిరేశ్వరం చెంచుగూండెలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలు, కుగ్రామాలు, కొండ ప్రాంతాలు, రహదారి కనెక్టివిటీ లేని గ్రామాల్లో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చట్టాలపై అవగాహన కలిప్పించేలా ఆదేశాలు ఉన్నాయన్నారు. మహిళా చట్టాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్–1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు మీరంతా అర్హులని చెప్పారు. మీ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహించి, మలేరియా, డెంగ్యూ, రక్తహీనత, షుగర్, అనీమియా, తదితర పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్, డీటీ హరికృష్ణ, ఎఫ్ఆర్వో డి.కృష్ణప్రసాద్, ఐటీడీఏ ఏపీఓ నాగార్జున, న్యాయవాది జి.మాణిక్యరావు, సామాజిక కార్యకర్తల జుల్ఫీకర్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, ఎస్ఐ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నియంత్రించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్‌బాషా

శ్రీశైలంప్రాజెక్ట్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత నిర్వీర్యం అవుతుందని సున్నిపెంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నియంత్రణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల యువత మత్తుకు బానిసలై దేశానికి పనికి రాకుండా పోతున్నారన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యంతో యువత పాల్గొని నియంత్రించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎం.బుచ్చయ్య, ఎం.పద్మ, కె.రాజన్న, మహేశ్వర రెడ్డి, శివనాగిరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, కళ్యాణి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

28న ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన హెట్రోల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేయుటకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్ చదివిన ఐటీఐ విద్యార్థులు, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ : 9440224291 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తాత్రేయ స్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయ స్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

రేపటి నుంచి ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాలలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రఖ్యాత ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ వారిచే గణేశగాథలు అనే అంశంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. పురాణాలలోని గణపతి ఆవిర్భావ గాథలు, గణపతి తత్త్వం, గణపతి స్వరూపంలోని అంతరార్థాలు, గణపతి మహిమావిశేషాలు మొదలైన అంశాలు, అలాగే ప్రవచనంలో సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమ విశేషాలను వివరిస్తారు. భక్తులందరు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రవచనాలను విని తరించాలని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు పేర్కొన్నారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నందికొట్కూరు: ఈ నెల 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సహాయ సహకారాలు అందించాలని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రం అందజేశారు. వేడుకలకు పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నెల 28వ తేదీన కృష్ణుడి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కమిటీ సభ్యులు కుమారాచారి, సంజీవ, పార్థసారధి, నాగమద్దిలేటి, తదితరులు ఉన్నారు.

మెగాస్టార్ జన్మదిన వేడుకలు

ఆత్మకూరు: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఆత్మకూరు పట్టణం బీసీ కాలనీలోని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమాన సంఘం నాయకులు వృద్ధులకు బ్రెడ్లు, పాలు, అరటి, యాపిల్ పండ్లు అందించారు. వృద్ధుల సమక్షంలో కేకు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

28న మున్సిపల్ సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 28వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 28వ తేదీన జరిగే మున్సిపల్ సాధారణ సమావేశానికి ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని చెప్పారు.

పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. మండలంలోని వేంపెంటలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్‌క్రైమ్, రోడ్డు భద్రత, మహిళలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా పిల్లలు సెల్‌ఫోన్ వినియోగించే సమయంలో పెద్దలు గమనించాలని సూచించారు. అలాగే గ్రామంలో నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలం కంచెకు విద్యుత్ వాడకం వల్లే కోతలు



అడవి పందుల వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్న విద్యుత్ శాఖ అధికారులు

కొత్తపల్లి: గ్రామాలలో విద్యుత్ కోతలకు అడవి పందుల వేటగాళ్లే కారణమని, పొలాల వద్ద అడవి పందుల కోసం కరెంట్ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ అబీద్ హెచ్చరించారు. ఆయన బుధవారం రాత్రి, గురువారం మండలంలోని శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం గ్రామాల పొలిమేరలలో పొలాల వెంట గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామాలలో పొలాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్నాయన్నారు. అందువల్ల అడవి పందులు పొలాల్లోకి చొరబడి మొక్కజొన్న కంకులు, సోప్పదంటులను తింటున్నాయన్నారు. అడవి పందుల వేటగాళ్లు వాటిని వేటాడేందుకు విద్యుత్ కాపర్ వైర్లతో ఉచ్చులు వేస్తున్నారన్నారు. దీంతో ఈ గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. దీనికి తోడు కొందరు రైతులు పంటలను కాపాడుకొనేందుకు, అడవి పందుల వేటగాళ్లతో కుమ్మక్కై పొలాల గట్ల వద్ద కరెంట్ పెట్టించి విద్యుత్ కోతలకు కారణమవుతున్నారన్నారు. దీంతో ప్రజలు రాత్రివేళల్లో కరెంట్ కోతలను చవిచూడాల్సి వస్తుందన్నారు. పొలం కంచెకు కరెంట్ పెట్టడం వల్ల వన్య ప్రాణులకుగానీ, ప్రజలకుగానీ ఏదైనా అపాయం జరిగితే కారకులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అడవి పందుల వేటగాళ్ల వల్లే విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని వారికోసం గాలిస్తున్నట్లు చెప్పారు. గాలింపులో భాగంగా వేటకు ఉపయోగించే వైర్లు, కట్టెలు, ఉచ్చులు పట్టుకున్నామని, వేటగాళ్లు పరారయ్యారని వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుతో ప్రభుత్వ పథకాలకు అర్హత



పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ అన్నారు. ఆయన గురువారం మండలంలోని నందికుంట, దుద్యాల గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించి పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారన్నారు. రైతులతో ముఖాముఖీ నిర్వహించి ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంటల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాబోవు సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల గురించి చర్చించారు. ఎంపీఈఓ పల్లవి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది శివకృష్ణ నాయక్, శేషు, రైతులు పాల్గొన్నారు.


సంబంధం లేని పనులు కేటాయించడం తగదు



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వెలుగోడు: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు వివిధ రకాల పనులు కేటాయించడమే గాకుండా ఇప్పుడు టాయిలెట్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే పనిని కేటాయించడం తగదని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు గురువారం నిరసనను వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు మాధవీలత, లక్ష్మీప్రసన్న, వాసు, శాలు బాషా మాట్లాడుతూ.. స్కూలు కాంప్లెక్స్‌లోని టాయిలెట్ల ఫోటోలను గతంలో ఉపాధ్యాయులు యాప్‌లో అప్‌లోడ్ చేసేవారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ బాధ్యతలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు కేటాయించిందని దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. తమకు సంబంధం లేని విధులను కేటాయించరాదని కోరారు.


బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

వెలుగోడు: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికుల మరణానికి కారణమైన యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని, కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెలుగోడులో గురువారం ప్రజాసంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వై.నరసింహులు మాట్లాడుతూ.. అచ్యుతాపురం ఘటనలో 18 మందికి పైగా కార్మికులు మరణించారన్నారు. అనేకమంది తీవ్రంగా గాయపడినట్లు వాపోయారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మా కంపెనీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్, కార్యవర్గ సభ్యులు ఎల్ల నాయుడు, కె.లాలూ నాయక్, జంగం రెడ్డి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



భరతనాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళావేదికపై కర్నూలుకు చెందిన పి.గీతారెడ్డి, బృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది. కార్యక్రమంలో సిద్ధి వినాయక, ఓం నమఃశివాయ, గరుడ గమన, శివతాండవం, కాలభైరవాష్టకం తదితర గీతాలకు కీర్తన, అంకిత, దీక్షిత, వర్షిణి, పద్మ, ఇందు, ఆరాధ్య, యామిని, శ్రీజ, మేఘన తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.